గంగపుత్ర సంఘం డైరీ ఆవిష్కరణ

తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం డైరీని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ గంగ పుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, గంగపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు అంబటి మల్లయ్య, సుధాకర్, డా.బి. లక్ష్మయ్య పాల్గొన్నారు. – అంబర్‌పేట, ఫిబ్రవరి 11

సత్కరించిన కళాకారులతో యేలేశ్వరం చలపతి శాస్త్రి , నాట్య గురువు జీఎస్ వాసు

అంతా రామమయం సంగీతం కార్యక్రమం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11: శివశక్తి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కూచిపూడి నాట్య గురువు జీఎస్ వాసు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'అంతా రామమయం –2024 సంగీత, నృత్య'కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూచిపూడి నాట్యాచార్యులు యేలేశ్వరం చలపతి శాస్త్రి హాజరై మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయ కళలో కూచిపూడి నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ఈ సందర్భం గా కళాకారుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం కళాకారులు, అతిథులను ఘనంగా సత్కరించారు.

విద్యానగర్‌లో పీవీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బహుముఖ ప్రజ్ఞాశాలికి సముచిత గౌరవం

- తెలంగాణ రీవి పీవీ నరసింహారావుకు భారతరత్నపై ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రశంస
- పరిపాలనా దక్షతను చాటుకున్న తెలంగాణ బిడ్డ పీవీ
- పీవీ ఖ్యాతికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎనలేని కృషి

ముషీరాబాద్, ఫిబ్రవరి 11: భారతదేశ మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక సంస్కర్త, తెలంగాణ రీవి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలుగువారికి దక్కిన గౌరవమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన పీవీకి నివాళి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పీవీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లిన పీవీ ఇక వెనక్కి తిరిగి చూడలేదు. ఒక్కో అందలం ఎక్కుతూ చివరికి ప్రపంచమే కీర్తించే విధంగా భారత దేశ ప్రధానిగా తన పరిపాలనా దక్షతను చాటుకున్నారని కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ప్రజల కష్ట–సుఖాలను ఎరిగిన భూమి పుత్రుడని ప్రశంసించారు. దేశాన్ని గండం నుంచి గట్టెక్కించిన తెలంగాణ బిడ్డకు ఇన్నాళ్లకు సముచిత గౌరవం దక్కిందన్నారు. స్థిరమైన ఆర్థిక ప్రగతి సాధన దిశగా దేశాన్ని అడుగులు వేయించిన ఘనత పీవీకే దక్కిందని, ఆలస్యమైనా కేంద్రం పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయమని, ఇది రాజకీయాలకతీతంగా అభినందించదగ్గ విషయమన్నారు. పీవీ ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, అనూరాధ, గీతారెడ్డి, ప్రేమ్‌కుమార్, పవన్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

అంబర్‌పేట: నల్లకుంట డివిజన్ బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లో పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ట్రస్టు ప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దేశం విపత్కర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణలను చేపట్టి దేశ ప్రగతికి పీవీ బాటలు వేశారని కొనియాడారు. రక్తదానం అనేది ప్రాణాలు నిలబెట్టే మహా సత్కార్యం అని, ప్రపంచంలో దీనికి సాటి మరొకటి లేదని అన్నారు. ఈ సందర్భంగా రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్, డీ గ్లాజ్ మసీద్, కృష్ణానగర్‌పార్కు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా రావడం లేదని ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్యే పాదయాత్రలో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకుడు పి.సంతోష్‌కుమార్ జలమండలి సిబ్బందితో తాగునీటి సరఫరాను పునరుద్ధణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సన్యాసిరావు, విజ్ఞాన్‌పూరి మేనేజర్ షాకీర్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

– కాచిగూడ, ఫిబ్రవరి 11

బ్రహ్మోత్సవాల్లో ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్దన్‌మూర్తి

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 : ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 6.30 గంటలకు సుప్రభాతం, 7 విష్ణు సహస్రనామ పారాయణం, స్వామి వారికి అర్చన, మంగళ నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయం ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్దన మూర్తి పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

కళాకారులకు ఐకాన్ అవార్డులు ప్రదానం

ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ఆదివారం 'ఇండియన్ పవర్ ఐకాన్' అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. విద్య, వైద్యం, నాట్యం, సంగీతం, సాహిత్యం తదితర రంగాల లబ్ధప్రతిష్టులైన పలువురికీ విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, దైవజ్ఞశర్మ, చిల్లా రాజశేఖర్‌రెడ్డి, సుధానాయుడు, నిర్వాహకులు రంజిత్ పాల్గొని సత్కరించి వారి సేవలను కొనియాడారు. – తెలుగు యూనివర్సిటీ

యువకులు క్రీడల్లో రాణించాలి

యువకులు క్రీడల్లో రాణించాలని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎంఎస్‌కే ప్రసాద్ వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులను అభినందించారు. – సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 11

భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి

సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట, పోచమ్మబస్తీలో ఆదివారం మార్కండేయ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ పల్లకీ సేవను నిర్వహించారు. రాచకొండ అడిషనల్ ఎస్పీ వెంకటరమణ, హైకోర్టు సీనియర్ న్యాయవాది జీఎల్ నర్సింహారావు, ఆధ్యాత్మికవేత్త చందర్‌పాల్‌బాబా, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. – అంబర్‌పేట, ఫిబ్రవరి 11

శ్రీరాంనగర్‌బస్తీ కమిటీ ఎన్నిక

బాగ్‌లింగంపల్లిలోని శ్రీ రాంనగర్‌వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం బస్తీ కమ్యూనిటీ హాల్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరినాథ్, చైర్మన్‌గా రాములు, ప్రధాన కార్యదర్శిగా పీపుల్స్ గంగాధర్, కోశాధికారిగా ఎన్.రవి, కమ్యూనిటీ సభ్యులుగా విశ్వనాథం, శ్రీహరి, గోపి, మోహన్‌రావు, యాద య్య, మహేశ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్, సునార్, ఆనంద్‌కుమార్ ఎన్నికయ్యారు – చిక్కడపల్లి, ఫిబ్రవరి 11

రెజ్లింగ్‌లో కార్వాన్ సోదరుల సత్తా

తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్–20 రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఇటీవల వరంగల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో కార్వాన్ నియోజకవర్గం సజ్జిమండికి చెందిన ముగ్గురు సోదరులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. కార్వాన్ సజ్జిమండికి చెందిన కట్ట మణిశంకర్ 86 కేజీల విభాగంలో, కట్ట ఘని శంకర్ 82 కేజీల విభాగంలో, కట్ట సాయిశంకర్ 130 కిలోల విభాగంలో బంగారు పతకాలను సాధించారు. వీరు ముగ్గురు సొంత అన్నదమ్ములు కావడం విశేషం. వీరిని ఆదివారం వీరాభిమన్యు వ్యాయమశాల పహిల్వాన్ కట్ట లింగం సన్మానించారు – మెహిదీపట్నం ఫిబ్రవరి 11

ఉచిత వైద్య శిబిరం

బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ క్లబ్, ప్రైవేట్ క్లీనిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని అధ్యక్షుడు ఆర్.వివేక్ తెలిపారు. డాక్టర్ ప్రత్యూష నేతృత్వంలో పరీక్షలు చేసి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామి గౌడ్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, ఫిబ్రవరి 11

విద్యతోనే సమాజంలో సామాజిక మార్పు

- స్పీకర్ గడ్డం ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

రవీంద్రభారతి, ఫిబ్రవరి 11 : విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, వడ్డెర కులస్తులు ప్రతి ఒక్కరూ చదువుకొని ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగితే పదవులు వాటంతట అవే వస్తాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో వడ్డెర ఆత్మగౌరవ సభను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పలువురు వడ్డెర సంఘం నేతలు, మేధావులను మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలు పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని అన్నారు. వడ్డెర విద్యార్థి వసతి గృహ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మైనింగ్ కార్పొరేషన్ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని చెప్పారు. వడ్డెర ఫెడరేషన్ చైర్మన్ కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వడ్డెర కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చే ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటుందని, ఆ యా రాష్ట్రాల సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొని కులాలను ఎస్సీ జాబితాలో చేర్చుతారని మంత్రి వివరించారు. ఎస్సీ జాబితాలో చేర్చే ప్రక్రియపై సీఎంతో మాట్లాతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మంత్రి మహదేవప్ప, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్, వడ్డెర కుల గురువు, ఇమ్మడి సిద్ధరామేశ్వర స్వామీజీ, పల్లె నిర్మల, పిట్ల కతాలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గజమాలతో సన్మానిస్తున్న వేముల వెంకటేశ్

కులగణన చేపట్టి పార్లమెంట్‌లో వెంటనే బిల్లు పెట్టాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి11: కులగణన వెంటనే చేపట్టి ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని జాతీయ ఓబీసీ హక్కుల పరిరక్షణ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఆదివారం ఆయన ఒక ప్రతికా ప్రకటన విడుదల చేస్తూ దేశంలో ఓబీసీలు 62 శాతం ఉన్నారని ఇప్పటి వరకు ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేక రాజకీయంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 10 శాతం లేని ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన ప్రధాని 62 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేకపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశానికి ఒక ఓబీసీ ప్రధాన మంత్రి అయి ఉండి కూడా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించకపోవడం దారుణమన్నారు. తెలంగాణలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టి వచ్చే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తెలంగాణలో కులగణన చేపట్టిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంజలిరెడ్డి కూచిపూడి రంగ ప్రవేశం

రవీంద్రభారతి, ఫిబ్రవరి11: ప్రముఖ నర్తకీమణి, నాట్యగురువు పూర్వ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి శిష్యురాలు అంజలిరెడ్డి ప్రదర్శించిన నాట్యాంశాలు కళాప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో దీపాంజలి కూచిపడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంజలిరెడ్డి కూచిపూడి రంగ ప్రవేశం శనివారం కనుకల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, నల్సార్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణాదేవరావు, ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద శంకర జయంతి తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు నాట్య గురువులు, నర్తకీమణులు అంజలిరెడ్డిని ఆశీర్వదించారు.

రవీంద్రభారతిలో కూచిపూడి రంగప్రవేశం చేస్తున్న అంజలిరెడ్డి

జీహెచ్ఎంసీ స్వీపర్లకు కార్పొరేటర్ చీరల పంపిణీ

కాచిగూడ కార్పొరేటర్‌గా ఉమాయాదవ్ ప్రమాణ స్వీకారం చేసి మూడేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు జీహెచ్ఎంసీ స్వీపర్లకు ఆదివారం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, కృష్ణమోహన్, కేసరి నర్సింగ్‌రావు, క్షీర్‌సాగర్, భీంరాజ్, శ్యామ్‌రాజ్, నాగభూషణంచారి, బల్వీర్, హజరిబాబు, రవియాదవ్, పంకజ్ పాల్గొన్నారు. – కాచిగూడ, ఫిబ్రవరి 11

కార్మికులకు 200 రోజులు పని కల్పించాలి

- సీఐటీయూ డిమాండ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 11: భవన నిర్మాణ కార్మికులకు పట్టణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని బతుకమ్మకుంట భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద ఆదివారం సభను నిర్వహించారు. సీఐటీయూ నగర నాయకులు ఎం.మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్నా కార్మిక సమస్యలు తీరడం లేదని, అడ్డా కార్మికులకు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, అడ్డా నాయకులు తిరుపతయ్య, ధర్మ, వెంకన్న, సూరి, శ్రీను, అంజయ్య, శివకుమార్, వీరమ్మ, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం

బీసీ కులాల సమగ్ర గణన చేపట్టాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఈశ్వరయ్య, చంద్రకుమార్, విశ్వేశ్వర్‌రావు, తదితరులు

బీసీ కులగణన సమగ్రంగా చేపట్టాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11 : బీసీ కులగణన మొక్కుబడిగా కాకుండా సమగ్రంగా నిర్వహించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆది నుంచి బీసీలు అన్యాయానికి గురవుతూనే ఉన్నారని, 2011లో కులగణన చేసినా బహిర్గతపర్చలేదన్నారు. బీసీ కులగణన కోసం అవసరమైతే దేశాన్ని జల్లెడ పట్టాలని, అప్పుడే లెక్కలు తేలుతాయన్నారు. కులగణన వారంలో పూర్తవుతుందని, అందుకు తగిన డ్రాఫ్ట్‌ను రూపొందించానన్నారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బీసీలకు వ్యతిరేకమైనా ఆ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ బహిరంగంగా కులగణన చేపడుతామని ప్రకటించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ వెంకటనారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రొఫెసర్ సురేంద్రబాబు, డాక్టర్ పృథ్వీ రాజ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the Instructions of our client Mr. Mokala Kethan Kumar S/o. Sri Mokala Ravi, R/o. Shalibanda, Hyderabad, it is to inform the general public that the original property documents belonging to our client pertaining to his Property bearing municipal No. 18-13-9/P/25/1 (PTIN NO. 1041838375) admeasuring 180 Sq. Yards situated at Patel Nagar Bandlaguda, Hyderabad have been misplaced. The documents Includes **i)** The Original Sale Deed vide registered document bearing No. 1350/2023. **ii)** The Original Sale Deed vide registered document No. 8862/2021 and **iii)** Registered Gift Settlement Deed vide registered document No. 4198/2015, all the above documents are registered at the office of the Sub Registrar Azampura Hyderabad. The general public is further informed that our client has also lodge a report with the Police Bandlaguda P.S to that effect. In view of the same, the general public is hereby cautioned/informed not to enter any kind of transaction on the basis of aforesaid missed documents otherwise my client shall be constrained to take necessary legal action against them.

Sd/- **M/s. J. Krishna,**
Adovate & Associates,
Office at H.No. 23-5-860, Arya Maidan, Shalibanda, Hyderabad,
Telangana-500065. Cell: 9848060058.

జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కుమార్, స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కావ్లే తదితరులు

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే వినోద్‌కుమార్

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 11: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడం హర్షణీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కావ్లే ఆధ్వర్యంలో 20వ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కావ్లే, విరించి హాస్పిటల్ చైర్ పర్సన్ మాధవీలతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల విజేతలకు షీల్డ్‌లతో పాటు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కావ్లే బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్షదీప్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మహమ్మద్ అక్రం అలీ, కె.నర్సింగ్‌రావు, సంఘ సేవకుడు పీఎం రాజు, స్కూల్ ప్రిన్సిపాల్ సునేత్రా కావ్లే, ట్రస్మా అధ్యక్షులు బి. గాలయ్య, అక్రంబేగ్, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.